
సాక్షి
హనుమకొండ

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



స్టీమ్ టు వందేభారత్

భారతీయ రైల్వే నేటితో 172 వసంతాలు పూర్తి చేసుకుంది. మొదటి స్టీమ్ లోకోమోటివ్ నుంచి ప్రారంభమై.. వందేభారత్ రైళ్లతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. - 8లో▸



యథావిధిగా డిగ్రీ సెమిస్టర్లు

కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల సెమిస్టర్ల పరీక్షలు యథావిధిగా ఇప్పటికే ప్రకటించిన టైంటేబుల్ ప్రకారమే నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండతీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రసన్నాంజనేయస్వామికి తమలపాకులతో అలంకరణ



హన్మకొండ అర్బన్: హనుమకొండ పద్మాక్షి కాలనీలోని హనుమత్‌గిరి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామిని తమలపాకుల మాలతో అలంకరించినట్లు అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. అనంతరం స్వామివారికి హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. మధ్యాహ్నం దీక్ష స్వీకరించిన స్వాములకు భిక్ష (అన్నదానం) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీహనుమాన్ దీక్ష సేవాసమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, సభ్యులు కరు దశరథ్‌కుమార్, మాదాసు మొగిలయ్య, గండ్రతి సుధాకర్, సత్యం, సీతా సమ్మయ్య, శంకర్, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కె.పట్టాభిరామారావు



రమేశ్‌బాబు

వరంగల్ లీగల్: హనుమకొండ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి సీహెచ్.రమేశ్‌బాబు మంగళవారం భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా మొదటి ఆదనపు జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు రానున్నారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.నారాయణబాబు వరంగల్ జిల్లా కోఆపరేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీపై వస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎండీ అబ్దుల్ రఫీ, జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమను బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన న్యాయమూర్తులు ఈనెల 23 వరకు తమ నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగిసిన 'టెన్త్ స్పాట్'

విద్యారణ్యపురి: కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో ఈ నెల 7వ తేదీనుంచి ప్రారంభమైన టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ మంగళవారం సాయంత్రం ముగిసింది. అన్ని సబ్జెక్టులు, ఒకేషనల్ కోర్సుల పరీక్షలవి కలిపి 2,27,403 జవాబుపత్రాలు వచ్చాయి. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలనుంచి ఎస్‌ఏలు, ఎస్‌జీటీలను స్పాట్ విధులకు కేటాయించారు. సీఈలుగా 113మంది, ఏఈలుగా 676మంది ఎస్‌ఏలు, 224మంది ఎస్‌జీటీలు స్పెషల్ అసిస్టెంట్లుగా విధుల్లో పాల్గొన్నారు. హనుమకొండ డీఈఓ వాసంతి క్యాంపు ఆఫీసర్‌గా, 8మంది పీజీహెచ్‌ఎంలు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా వ్యవహరించారు. ఈ నెల 30న లేదా మే మొదటివారంలో పరీక్ష ఫలితాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

రామన్నపేట : వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హిందుస్థాన్ కోకాకోలా బేవరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. డిప్లొమా ఇన్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ అభ్యర్థులు అర్హులుగా, 18 నుంచి 24 సంవత్సరాల్లోపు ఉన్న అభ్యర్థులకు అవకాశం కల్పించారు. ప్రాంగణ నియామకాలకు 65 మంది విద్యార్థినులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

కమలాపూర్ జీపీ రికార్డుల సీజ్

కమలాపూర్: కమలాపూర్ గ్రామ పంచాయతీ అధికారులపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన విచారణలో భాగంగా ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి మంగళవారం గ్రామ పంచాయతీ రికార్డులు సీజ్ చేశారు. ఇల్లు నిర్మించుకోకున్నా లేని ఇంటికి నంబర్ కేటాయించి యాజమాన్య ధ్రువీకరణ పత్రం జారీ చేశారని, ఇంటి పన్ను చెల్లించినట్లు రశీదు కూడా ఇచ్చారని, ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లకు కూడా నంబర్లు కేటాయించారని గ్రామ పంచాయతీ అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో మండల పంచాయతీ అధికారి జీపీలోని రికార్డులు సీజ్‌చేసి పట్టుకెళ్లారు. ఈ నెల 17న పూర్తిస్థాయి విచారణ జరుపనున్నట్లు ఆయన తెలిపారు.

మేం పనిచేయలేం!



పరకాల మున్సిపల్ కార్యాలయం

- రాజకీయ ఒత్తిళ్లు, శాఖాపరమైన చర్యలతో బెంబేలు
- 12 ఏళ్లలో 10 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

పరకాల మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించేందుకు జంకుతున్న అధికారులు, సిబ్బంది

పరకాల: కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్లు పరకాల మున్సిపల్ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. ఒక వైపు రాజకీయ ఒత్తిళ్లు.. మరోవైపు అధికారుల చర్యలతో అసలు విధులు నిర్వర్తించాలా వద్దా అనే మీమాంసలో ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. పేరుకు పెద్దరికం తప్ప పరకాల మున్సిపాలిటీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టడుతుందనే చెప్పవచ్చు. మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం పూర్తికావడంతో మాజీలమంటూ కొందరు.. కాబోయే కౌన్సిలర్లమంటూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ పనులు చేయించుకోవడానికి ఉద్యోగులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. మరోవైపు విధుల్లో ఎలాంటి అలసత్వం వహించినా.. అక్రమాలకు పాల్పడినా, పైరవీలకు ప్రాధాన్యం ఇచ్చినా శాఖాపరమైన చర్యలకు అధికారులు వెనుకడుగు వేయడం లేదు. దీంతో ఇటు రాజకీయ పార్టీల నాయకులు, అటు అధికారుల మధ్య ఏం చేయాలో వారికి పాలుపోడం లేదు.

బదిలీ చేస్తే వెళ్లిపోతాం..

కొద్ది రోజులుగా వస్తున్న రాజకీయ ఒత్తిళ్లు భరించలేక కొందరు.. పని ఒత్తిళ్లతో మరికొందరు అధికారులు, సిబ్బంది మేం ఇక్కడ పనిచేయలేం. బదిలీ చేస్తే వెళ్లిపోతామని ఓ ఉన్నతాధికారి ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం. ఇక్కడ రాజకీయాలు చాలా ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేయగా.. తాను కొత్తగా వచ్చాను, మీకంటే పెద్ద సవాలే కదా అని ఉన్నతాధికారి పేర్కొన్నట్లు తెలిసింది. కాగా, 12 ఏళ్ల పరకాల మున్సిపాలిటీ చరిత్రలో 10 మంది కమిషనర్లు మారారు. దీంతో ఉద్యోగుల పరిస్థితి కూడా ప్రశ్నార్థకమేనని ప్రజలు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సహకరించినందుకు ఇద్దరిపై వేటు

ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ మాజీ కౌన్సిలర్‌ను రికార్డు సెక్షన్‌లోకి తీసుకెళ్లిన పాపానికి ఇద్దరు ఉద్యోగులపై వేటు పడింది. ఆ మాజీ కౌన్సిలర్.. వేటుపడిన ఉద్యోగితో సన్నిహితంగా ఉండేవారు. ఆ ఉద్యోగితోపాటు మరో ఉద్యోగిపై అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

ఇంటి అనుమతులపై అయోమయం..!

పరకాల మున్సిపాలిటీ పరిధిలో అనేక ఇళ్లు పాత ఇంటి స్థలాలు, నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా కొనసాగుతున్నట్లు అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుండడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆయా పనులను అడ్డుకునేందుకు వెళ్లే టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని కొన్ని రాజకీయ పార్టీల నాయకులు అడ్డుకుంటున్నారు. దీంతో తప్పలేని పరిస్థితుల్లో వెనుదిరగాల్సి వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితులను భరించలేకనే 6 నెలల క్రితం ఓ టౌన్‌ప్లానింగ్ అధికారి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయారు.

నేత్రపర్వం.. రాములోరి రథోత్సవం



పెద్దరథంపై సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు



బారులుదీరిన భక్తులు

కమలాపూర్: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సీతారాముల పెద్దరథోత్సవం నేత్రపర్వంగా సాగింది. సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను రథంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన రథోత్సవం రాత్రి వరకు కొనసాగగా.. హనుమాన్ మాలధారులు, భక్తులు రథాన్ని లాగి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. స్థానిక రామాలయంలో రాత్రి శ్రీ సీతారాముల నాగవెల్లి, పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. రథోత్సవం సందర్భంగా త్రినేత్ర వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ వంశపారంపర్య అర్చకులు పరాశరం సత్యనారాయణాచార్యులు, సీతారామాచార్యులు, వెంకటాచార్యులు, ఆదిత్యతేజ రాఘవాచార్యులు, మణికంఠ భిక్షమాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి డెయిరీలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మేయర్, కమిషనర్‌తో సమీక్షిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

వరంగల్: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు డెయిరీలు ఏర్పాటు చేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాడేతో కలిసి పరకాల నియోజకవర్గంలోని బల్దియా పరిధిలో ఉన్న 15, 16, 17 డివిజన్లలో అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుకనూరు తరహాలో గీసుకొండ మండలంలోని వంచనగిరి, దామెర మండలంలో ఏర్పాటు చేయనున్న డెయిరీలకు స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ధర్మారం, గొర్రెకుంట గాడిపల్లి ప్రాంతాల్లో కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. 66 డివిజన్లలో 2057 జనాభాకు సరిపడా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుపై బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

17 నుంచి 'భూభారతి' సదస్సులు

- కలెక్టర్ ప్రావీణ్య
- కలెక్టరేట్‌లో అధికారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం జిల్లాలో అమల్లోకి వచ్చిందని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్ లో భూ భారతి చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలపై తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టం గెజిట్ ప్రతులు, జీఓ పత్రాలు ప్రతి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈనెల 17 నుంచి ప్రతి మండలంలో భూభారతి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు స్థానిక ఎమ్మెల్యేతోపాటు భూమి హక్కులకు సంబంధించి అవగాహన ఉన్న వ్యక్తులను, మీ సేవ కేంద్రాల ఆపరేటర్లను ఆహ్వానించాలని సూచించారు. సందేహాల నివృత్తికి తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నూతన చట్టంలోని పలు అంశాలపై పరకాల, హనుమకొండ ఆర్డీఓలు డాక్టర్ నారాయణ,రాథోడ్ రమేష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- చింతలపల్లిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభాస్థలి పనుల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

ఎల్కతుర్తి: హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలైందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఈనెల 27న ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామ సమీపంలో సుమారు 1200 ఎకరాల స్థలంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభాస్థలి పనులను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సభకు తరలివచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఏకైక వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనతో రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సభకు తమ భూములు ఇచ్చిన రైతులకు బీఆర్‌ఎస్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు పిట్టల మహేందర్, మండల సురేందర్, తంగెడ మహేందర్, తంగెడ నగేశ్, ఎల్తూరి స్వామి, గొల్లె మహేందర్, కడారి రాజు, జూపాక జడ్సన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె నోటీస్



వీసీ ప్రతాప్‌రెడ్డికి సమ్మె నోటీస్ అందజేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు

కేయూ క్యాంపస్: తమను రెగ్యులరైజ్ చేయాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ కాంట్రాక్టు ప్రొఫెసర్స్ కోఆర్డినేషన్ బాధ్యులు మంగళవారం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. తొలుత కొంతసేపు పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ కోఆర్డినేషన్ బాధ్యులు శ్రీధర్‌కుమార్‌లోథ్, నిరంజన్, సాధు రాజేశ్, మాదాసి కనకయ్య, జూల సత్య మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఈనెల 19 నుంచి సమ్మెకు వెళ్తున్నారని తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా తలపెట్టామని పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ బాధ్యులు బి.సతీష్, సంకినేని వెంకట్, ఫిరోజ్‌పాషా, ఆశీర్వాదం, అరూరి సూర్యం, గడ్డం కృష్ణ, టి.నాగయ్య, రఘువర్ధన్‌రెడ్డి, వినీత, శ్రీదేవి, సునీత, సుచరితపాల్, భాగ్య, ఉషాకిరణ్, వాణిశ్రీ, సదాశివ్, ప్రసాద్, వెంకటేశం, సాహితి, చందూలాల్, సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, యూనివర్సిటీలో వివిధ పరిపాలన పదవులు నిర్వహిస్తున్న పలువురు కాంట్రాక్టు ప్రొఫెసర్లు తమ పదవులకు రాజీనామాలు చేసి అధికారులకు సమాచారం అందించారు.

సంస్థాగత నిర్మాణ లొల్లి

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ముసలం
- టీజీ ఎన్పీడీసీఎల్ కార్యవర్గానికి, రాష్ట్ర సెక్రటరీ జనరల్‌కు మధ్య విభేదాలు
- దానయ్యను తొలగిస్తున్నట్లు మాతంగి శ్రీనివాస్ సీఎండీకి లేఖ
- కొనసాగిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్ మరో లేఖ
- ఎవరిది పరిగణనలోకి తీసుకోవాలన్నదే సందిగ్ధం..

హన్మకొండ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో సంస్థాగత నిర్మాణం విషయంలో ముసలం మొదలైంది. అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ కార్యవర్గానికి, రాష్ట్ర సెక్రటరీ జనరల్ మధ్య విభేదాలు పొడసూపాయి. ప్రస్తుతం పూర్తి స్థాయి కార్యవర్గాలు లేనందున అడ్‌హాక్ కమిటీ కొనసాగుతుందని ఆ అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర కన్వీనర్‌గా పూర్వ అధ్యక్షుడు, కో కన్వీనర్లుగా గత సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్, అదే విధంగా ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖలోని అధ్యక్షుడు కన్వీనర్‌గా, కో కన్వీనర్లుగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన బక్క దానయ్యతో పాటు మరికొందరు ఉన్నారు.

హీటెక్కించిన దానయ్య ఎపిసోడ్

అసోసియేషన్ సంస్థాగత నిర్మాణం ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో విభేదాలు పొడసూపాయి. టీజీ ఎన్పీడీసీఎల్ ప్రస్తుత కో కన్వీనర్ బక్క దానయ్యను ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తూ, కో కన్వీనర్ పదవినుంచి తొలగిస్తున్నట్లు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాతంగి శ్రీనివాస్.. సీఎండీ వరుణ్‌రెడ్డికి రాసిన లేఖ విడుదల చేశారు. ఈ విషయాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ దృష్టికి సభ్యులు తీసుకెళ్లారు. బక్క దానయ్య సభ్యత్వ రద్దు చెల్లదని, కో కన్వీనర్‌గా కొనసాగిస్తున్నట్లు సీఎండీకి లేఖ రాశారు. త్వరలో సంస్థాగత ఎన్నికలు జరగనున్నాయని, అప్పటి వరకు పాత కమిటీలు కొనసాగుతున్నాయని ఆరెపల్లి మోహన్ ఆ లేఖలో తెలిపారు. బక్క దానయ్య తమ సభ్యుడేనని పేర్కొన్నారు.

సభ్యులు ఏమంటున్నారంటే..

సభ్యుడిని అసోసియేషన్ నుంచి తొలగించడానికి బైలా ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని ఆ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అసోసియేషన్ సెంట్రల్ (రాష్ట్ర) కార్యవర్గంలో ముందుగా నోటీసు జారీ చేయాలని, వారు నిర్ణయం తీసుకున్నాక 15 రోజుల సమయంతో సదరు సభ్యుడికి నోటీసు జారీ చేయాలని అంటున్నారు. ఇలా కాకుండా ఇష్టం వచ్చినట్లు సభ్యత్వం తొలగించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేస్తున్నారు.

ఎవరి లేఖ పరిగణనలోకి తీసుకోవాలి?

అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్.. ఎన్పీడీసీఎల్ కార్యదర్శి బక్క దానయ్య సభ్యత్వం రద్దు చేసినట్లు ఈ నెల 8న ఇచ్చిన లేఖను పరిగణనలోకి తీసుకోవాలా.. ఆ తర్వాత ఈ నెల 9న బక్క దానయ్య సభ్యుడిగా కొనసాగుతున్నారని ఇచ్చిన లేఖను పరిగణనలోకి తీసుకోవాలా అనే గందరగోళంలో అసోసియేషన్ వర్గాలున్నాయి. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న బక్క దానయ్యపై మాతంగి శ్రీనివాస్ వ్యవహరిస్తున్న వైఖరిని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఖండించారు.

మాతంగి శ్రీనివాస్ ఫిబ్రవరిలోనే బహిష్కరణ

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్‌ను ఫిబ్రవరిలోనే బహిష్కరించామని ఆ అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అసోసియేషన్ ప్రతినిధిగా ఫుల్‌టైం వాడుకుంటూ సంఘానికి చెందిన నిధులు వాడుకుంటూ, పనిచేస్తున్న నాయకులను వేధిస్తున్న తీరుపై ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీలో నిలదీసి అదే రోజు ఇంటర్నల్‌గా బహిష్కరించినట్లు వారు ఆ ప్రకటనలో వివరించారు. బక్క దానయ్యను బలంగా బలపరుస్తున్నామని హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశారు.

మే 1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు



కోచ్‌లకు సూచనలు చేస్తున్న డీవైఎస్‌ఓ అశోక్

వరంగల్ స్పోర్ట్స్: పట్టణ పరిధిలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను మే 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. శిబిరాల నిర్వహణ, క్రీడాకారుల నమోదు అంశంపై మంగళవారం హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో కోచ్‌లతో డీవైఎస్‌ఓ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ శిబిరాలకు విద్యార్థులను తీసుకొచ్చేలా ఒక్కో కోచ్‌కు 10 పాఠశాలలను అప్పగించినట్లు తెలిపారు. ఆయా కోచ్‌లు పాఠశాల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో మాట్లాడి నాలుగు నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు శిబిరాల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. శిక్షణ శిబిరాల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులను ఇండోర్ స్టేడియంలో అందజేయాలని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా, వేసవి సెలవులను వృథా చేయకుండా ఆసక్తి గల క్రీడాంశాల్లో శిక్షణ అందించేలా చొరవ చూపాలని తల్లిదండ్రులను కోరారు. కోచ్‌లు శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్, అఫ్జల్, జీవన్‌గౌడ్, ప్రభుదాస్, శంకర్, రమేశ్, ప్రశాంత్, నరేందర్ పాల్గొన్నారు.


ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా రాజేందర్



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ రాజేందర్

హన్మకొండ చౌరస్తా: ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్‌గా టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఎన్నికయ్యారు. హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీఓస్ భవన్‌లో టీఎన్జీఓ, టీజీఓ, ఉపాధ్యాయ, నాలుగో తరగతి ఉద్యోగులు, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకుల సమావేశం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రాజేందర్, కన్వీనర్‌గా టీజీఓ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కోకన్వీనర్‌గా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా టీజీఓ నాయకుడు ఎ.జగన్మోహన్‌రావుతోపాటు మిగిలిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

త్రీ ఇన్ వన్ ట్రీ!



వేప, రావి, మర్రి చెట్లు

కమలాపూర్: సాధారణంగా ఎక్కడ చూసినా చెట్టు ఒకటే ఉంటుంది. ఎక్కడో ఒక చోట మర్రి చెట్టుపై తాటి చెట్లు అరుదుగా కనిపిస్తాయి. కానీ, మండలంలోని కానిపర్తిలో మాత్రం ముచ్చటగా మూడు చెట్లు ఒక్కటిగానే ఉన్నాయి. సంవత్సరాల క్రితం గ్రామంలోని రోడ్డు పక్కన ఒక వేప చెట్టు మొలిచింది. 40 ఏళ్ల క్రితం ఆ వేప చెట్టు అడుగు భాగంలో ఓ రావి చెట్టు, మరో 20 ఏళ్ల తర్వాత ఆ రెండు చెట్ల మధ్యలో నుంచి ఓ మర్రి చెట్టు పుట్టుకొచ్చాయి. ఒకే మొదలు నుంచి పెరిగిన ఆ మూడు చెట్లు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కాగా, తమ ఇంటి ఎదుట మూడు చెట్లు కలిసి ఉండడం శుభసూచకమని, పండుగలు, మంగళ, శుక్రవారాల్లో ఈ చెట్లకు పూజలు చేస్తామని స్థానికురాలు పద్మ తెలిపారు.

సుందరీమణుల సందర్శనకు ఏర్పాట్లు చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు మే 14వ తేదీన వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాంప్లెక్స్ హాల్‌లో సుందరీమణులు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. ప్రావీణ్య మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీ పోటీల్లో పాల్గొననున్న వారిలో 30 మంది వరంగల్ పర్యటనకు వస్తున్న దృష్ట్యా ఈ కార్యక్రమం నిర్వహణతో చారిత్రక వారసత్వ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.సమావేశంలో జిల్లా ఖజానాశాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, నెహ్రూ యువకేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ శివాజీ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఈవెంట్ మేనేజ్మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక చేయాలి

ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, పరకాల ఆర్డీఓ కె.నారాయణ, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

వరంగల్: గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టర్‌లో ఎంపీడీఓలతో మంగళవారం వేసవి నీటి ఎద్దడి నివారణ, ఇందిరమ్మ ఇళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి మాట్లాడారు. ఈనెల 30 నుంచి మే 31 వరకు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం ఉంటుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాలవారీగా ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను మండల స్థాయి అధికారులు మరోసారి స్క్రూటీని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలను అధికారులు సమన్వయంతో అరికట్టాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని శ్రీసాయి కన్వెన్షన్ హాల్‌లో వ్యవసాయ జిల్లా అధికారి అనురాధ అధ్యక్షతన విత్తన, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, వ్యవసాయ అధికారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, డీలర్ల అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, ఏసీపీ కిరణ్‌కుమార్, ఏసీపీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి


మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: తెలంగాణ ప్రజాఫ్రంట్ వరంగల్, హనుమకొండ జిల్లాల నాలుగో మహా సభను విజయవంతం చేయాలని ఆ ఫ్రంట్ వరంగల్, హనుమకొండ జిల్లాల కన్వీనర్ జనగాం కుమారస్వామి పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మహాసభ పోస్టర్‌ను ప్రజాఫ్రంట్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాఫ్రంట్ నాలుగో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరేందుకు జరిగే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ హరగోపాల్, పాశం యాదగిరి, ప్రొఫెసర్ కాశీం, అనిశెట్టి రజిత, గాదె ఇన్నయ్య తదితరులు ఈ సభలో ప్రసంగిస్తారని వివరించారు. కార్యక్రమంలో గొల్లూరి ప్రవీణ్ కుమార్, బి.రమాదేవి, వెంగళరెడ్డి, సుధీర్ బాబు, ఇంద్రసేనా, పాపయ్య, ఎస్.రఘుశర్మ, గాదరి ఉప్పలయ్య, సందీప్, కళ్యాణ్, డి.జ్యోతిరమణి, వెంకటేశ్వర్లు, రమేశ్‌చందర్, కుమార్, రాజేందర్, భిక్షపతి, తిరుపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో వ్యక్తికి గాయాలు


నర్సయ్యకు ప్రథమ చికిత్స చేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

ములుగు రూరల్: అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం ఉదయం మండలంలోని ఇంచర్ల శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇంచర్ల గ్రామానికి చెందిన నర్సయ్య తన పొలం వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో అడవి పంది దాడి చేసింది. దాడిలో గాయపడిన నర్సయ్యకు 39వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్టీమ్ టు వందేభారత్..

172 వసంతాల భారతీయ రైల్వే సుదీర్ఘ ప్రయాణంలో కాజీపేట జంక్షన్ ప్రస్థానం


- ఏప్రిల్ 16 నుంచి 21వ తేదీ వరకు రైల్వే వారోత్సవాలు
- ప్రతిభ కనబరిచిన వారికి ఏటా అవార్డులు
- కాజీపేట జంక్షన్ నుంచి పలువురు ఎంపిక





కాజీపేట రూరల్ : భారతీయ రైల్వేకు నేటి (బుధవారం)తో 172 వసంతాలు పూర్తయ్యాయి. దేశంలో మొదటి రైలు 1853 ఏప్రిల్ 16వ తేదీన ముంబాయి-థానే మధ్య 34 కి.మీతో నడిపించారు. భారతీయ రైల్వే ప్రస్థానం మొదటి స్టీమ్ లోకోమోటివ్ నుంచి ప్రారంభమై.. ప్రస్తుతం డిజీల్‌లోకోమోటివ్, హాల్కోలోకోమోటివ్, ఎలక్ట్రిక్ లోకోమోటివ్, వందేభారత్ రైళ్లతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.

కాజీపేట రైల్వే స్టేషన్ ఏర్పాటుకు శ్రీకారం..



కాజీపేట మీదుగా నిజాం స్టేట్ రైల్వే కంపెనీ లిమిటెడ్ అధికారులు సరుకు రవాణా కోసం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ వరకు సింగిల్‌లైన్ నిర్మించారు. 1904లో కాజీపేట రైల్వే స్టేషన్‌ను చిన్న షెడ్డుతో ప్రారంభించారు. తర్వాత కాజీపేట-సికింద్రాబాద్ రైల్వే లైన్ నిర్మాణం జరిగింది. 1917లో కాజీపేటలో రైల్వే స్టీమ్‌లోకోషెడ్‌ను ఏర్పాటు చేశారు. డీజిల్, ఎలక్ట్రిక్ ఇంజిన్ల వినియోగంతో 1991లో స్టీమ్‌లోకోషెడ్ మూతబడింది. 1923లో కాజీపేట రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మారింది. 1917లో విజయవాడ-బల్లార్షా మధ్య కాజీపేట మీదుగా డబుల్‌లైన్ ఏర్పాటైంది. కాజీపేట-బల్హార్షా మధ్య మూడో రైల్వే లైన్ కూడా పూర్తి కావొస్తుంది. కాజీపేట కేంద్రంగా 1992లో ఎలక్ట్రిక్‌లైన్ నిర్మాణం జరిగింది. 1970 వరకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైల్వేతో సంయుక్తంగా ఆర్టీసీ కండక్టర్ల నియామకం చేపట్టింది. అప్పట్లో వీరి కోసం కాజీపేట జంక్షన్‌లో క్వార్టర్స్‌ను కూడా నిర్మించారు. కాజీపేట నుంచి రోజూ 170 రైళ్ల రాకపోకలు, 15 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు రూ.సుమారు 12 లక్షల ఆదాయం వస్తోంది. కాజీపేట కేంద్రంగా సుమారు 5 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. కాజీపేట యంత్రాంగం బల్హార్షా మాణిక్ ఘర్, విజయవాడ వద్ద కొండపల్లి, కరీంనగర్ రూట్‌లో జగిత్యాల, సికింద్రాబాద్ రూట్‌లో భువనగిరి వరకు విస్తరించి ఉంది. ప్రస్తుతం కాజీపేట రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీం రీ-డెవలప్‌మెంట్ వర్క్స్‌తో ప్రపంచస్థాయి రైల్వే స్టేషన్‌గా అత్యాధునీకరిస్తున్నారు. కొన్ని నెలల్లో కాజీపేట కేంద్రంగా నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్‌లు ప్రారంభం కానున్నాయి. దీంతో కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యత మరింత పెరగనుంది.



కాజీపేట రైల్వే డీజిల్‌లోకోషెడ్ నిర్మాణం..

కాజీపేట రైల్వే డీజిల్‌లోకోషెడ్‌ను ఏప్రిల్ 21, 1973లో ప్రారంభించారు. నాటి నుంచి డీజిల్‌షెడ్ దినదినాభివృద్ధి సాధించి భారతీయ రైల్వేలో గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం షెడ్‌లో 240 ట్రాక్షన్, డీజిల్‌లోకోల నిర్వహణతో 715 మంది రైల్వే కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ షెడ్ నుంచి డిప్యూటేషన్‌పై ఇతర దేశాల రైల్వేకు డీజిల్‌షెడ్ కార్మికులు వెళ్తుంటారు. డీజిల్‌షెడ్ ఉత్తమ నిర్వహణ షెడ్‌గా రైల్వే జీఎం, రైల్వే బోర్డు, ఇతర రైల్వే అవార్డులను సొంతం చేసుకుంది.



కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్ నిర్మాణం..

కాజీపేటలో 2004లో రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్ నిర్మాణం జరిగింది. మొదట ఈ షెడ్ 100 లోకోమోటివ్‌ల నిర్వహణ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 205 లోకోల నిర్వహణతో సుమారు 420 మంది రైల్వే సిబ్బందితో షెడ్ నిర్వహణ జరుగుతోంది. దినదినాభివృద్ధి చెంది ఈ షెడ్ దక్షిణ మధ్య రైల్వేలో ప్రత్యేక గుర్తింపు సాధించి ఎన్నో రైల్వే అవార్డులు కైవసం చేసుకుంది.

మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టాలపైకి రైళ్లు..

సాంకేతిక విప్లవం దినదినాభివృద్ధి చెంది స్టీమ్‌లోకోమోటివ్ నుంచి డీజిల్‌లోకోమోటివ్, డబ్ల్యూడీఎం-2, 3, 4, 6 (కంప్యూటరైజ్‌డ్‌లోకోమోటివ్), తర్వాత ఎలక్ట్రిక్ లోమోటివ్, ఎలక్ట్రిక్‌లోకోమోటివ్‌లో అమెరికా టెక్నాలజీతో డబ్ల్యూఏపీ-2, 4, 7, డబ్ల్యూఏజీ- 5, డబ్ల్యూఏపీ-12 లోకోమోటివ్‌లు వచ్చాయి. తర్వాత వందేభారత్ రైలు 130 కేఎంపీహెచ్ స్పీడ్‌తో పట్టాలపై పరుగులు పెడుతోంది. రైల్వే శాఖ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్యాసింజర్ నుంచి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టి తక్కువ ఖర్చుతో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తుంది. 1853, ఏప్రిల్ 16న మొదటి రైలు ప్రారంభమైనప్పటి నుంచి ఏటా రైల్వే వీక్ అవార్డుల వారోత్సవాల పేరిట విధుల్లో ప్రతిభ కనబరిచిన రైల్వే అధికారులు, కార్మికులకు అవార్డులు, నగదు పురస్కార్, ప్రశంస పత్రాలు ప్రదానం చేసి వారిని ప్రోత్సహిస్తోంది. కాజీపేట జంక్షన్ నుంచి కూడా ఈ ఏడాది పలువురు రైల్వే అవార్డులకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో నేరస్తుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్ : తనను ప్రేమించాలని, లేనిపక్షంలో చంపుతానని ఓ బాలికను బెదిరింపులకు గురిచేసిన ఘటనలో నేరం రుజువుకావడంతో ధర్మసాగర్ మండలం నారాయణగిరికి చెందిన పసునూరి రఘుకు 3 సంవత్సరాల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు (పోక్సో కోర్టు) జడ్జి బి.అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. మడికొండకు చెందిన ఓ బాలిక పదోతరగతి చదువుతోంది. రోజు బస్‌లో స్కూల్‌కు వెళ్లి వచ్చేది. జనవరి 19, 2023న స్కూల్‌కు వెళ్లకుండా ఏడుస్తుండగా తల్లిదండ్రులు ప్రశ్నించారు. దీంతో స్కూల్ బస్ డ్రైవర్ పసునూరి రఘు తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నాడని తల్లిదండ్రులకు తెలిపింది. తండ్రి ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం నిరుపణకావడంతో నేరస్తుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. ఈ కేసును సీఐ పి.కిషన్, ఎస్సై ఏ.నర్సింహారావు పరిశోధించగా లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి నీరజ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ వీరగోని రాజేశ్, సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు. బాధితురాలికి నష్టపరిహారంగా రూ.25 వేలు చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను జడ్జి ఆదేశించారు.

పోలీసులు వేధిస్తున్నారని యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎంజీఎం : ధర్మసాగర్ పోలీసులు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన వరంగల్ పోతన నగర్‌కు చెందిన సింగరాపు రాజేశ్ మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొన్ని నెలలుగా తన భార్య విజయతో రాజేశ్ కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విజయ తన పుట్టినిల్లు ధర్మసాగర్‌కు వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన రాజేశ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడే ముందు తన చావుకు తన భార్య విజయ, బావమరిది అరూరి వినయ్, మరదలు జ్యోతి, పోలీసులే కారణమంటూ సోషల్ మీడియాలో ఓ ఆడియో పోస్ట్ చేశారు. ఈ ఘటనను గమనించి కుటుంబ సభ్యులు, స్థానికులు రాజేశ్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం రాజేశ్ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

నీతి ఆయోగ్‌లో గంగారం బ్లాక్‌కు మొదటి ర్యాంక్

గంగారం: దేశంలో ఆకాంక్షిత (ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం) మండలాల డెల్టా ర్యాంకింగ్స్‌లో తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం అగ్రస్థానం, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం రెండో స్థానంలో నిలిచిందని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం అధికారి శ్రీనాథ్ హాల్కే వెల్లడించారు. మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సూచన మేరకు అన్నిశాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఐదు థీమ్‌లు, 40 సూచికల ద్వారా లోపాలను గుర్తించి మెరుగుపరచడం వల్లే విజయం సాధ్యమైందన్నారు. హెల్త్ అండ్ న్యూట్రీషియన్, విద్య, సామాజికాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో అభివృద్ధి సాధించడంతో గంగారం మండలం నీతి ఆయోగ్‌లో మొదటి ర్యాంకు సాధించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ నీతి ఆయోగ్ ప్రకటించిన డిసెంబర్ మూడో త్రైమాసిక ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) డెల్టా ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలోనే గంగారం బ్లాక్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. భారతదేశంలో అత్యంత అభివృద్ధి చెందిన బ్లాక్‌లలో పాలనను మెరుగుపర్చడం, జీవన నాణ్యతా ప్రమాణాలను పెంచడం లక్ష్యమన్నారు. బ్లాక్‌ల పనితీరు, సూచికల పురోగతిపై ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుందన్నారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల సంబంధిత అధికారులు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పనిచేసి అభివృద్ధికి బాటలు వేయాలని సీతక్క కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

- తీర్పు వెలువరించిన జడ్జి నారాయణబాబు



కాళేశ్వరం: హత్యకేసులో నిందితుడికి భూపాలపల్లి జడ్జి నారాయణబాబు రూ.10వేల జరిమానా, జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా సీతానాగారం గ్రామానికి చెందిన సంగిశెట్టి కిశోర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బ్రహ్మణపల్లి ఇసుక క్వారీలో సూపర్ వైజర్‌గా పని చేస్తూ ఉండేవాడు. 2018లో కిశోర్ స్నేహితుడు, ఇసుక క్వారీ ఇన్‌చార్జ్‌గా పనిచేసే ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరానికి చెందిన చోడవరపు నర్సింహామూర్తి మహదేవపూర్ మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన యువతి గోగుల లలితను ప్రేమ వివాహం చేసుకోవడానికి విజయనగరం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆ యువతి తమ్ముడు గోగుల విజయ్ 2018 ఆగస్టు 26న నర్సింహామూర్తికి సహకరించాడనే కోపంతో కిశోర్‌ను గొడ్డలిలో నరికి చంపాడు. ఈ విషయమై మృతుడి తండ్రి సంగిశెట్టి దుర్గారావు మరుసటి రోజు 27న మహదేవపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్సై డి. విజయ్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి మహదేవపూర్ సీఐ రంజిత్ కుమార్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత సీఐగా వచ్చిన అంబటి నర్సయ్య నిందితుడిపై చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్సై వివరించారు.

పీఠాధిపతుల పుష్కర స్నానాలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేయనున్నారు. పుష్కర ప్రారంభం మే 15న మొదటి రోజు శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్‌నుంచి మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారు. మూడవ రోజు మే 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, మే18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి, మే 19న నాసిక్ త్రయంబకేశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, మే 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి వార్లు పుష్కర స్నానం ఆచరిస్తారని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

యథావిధిగా కేయూ డిగ్రీ సెమిస్టర్లు

- ఫీజు చెల్లించిన కళాశాలల విద్యార్థులకే పరీక్షలు
- వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం నిర్ణయం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బి ఒకేషనల్, బీసీఏ 2,4,5,6వ సెమిస్టర్ల పరీక్షలు యథావిధిగా ఇప్పటికే ప్రకటించిన టైంటేబుల్ ప్రకారమే ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. కేయూ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, ప్రైవేట్, అటానమస్ కళాశాలలు కలిపి 292 వరకు ఉండగా అందులో ఆయా సెమిస్టర్ల పరీక్షల ఫీజులు కేవలం 103 కాలేజీలు మాత్రమే పరీక్షల విభాగానికి చెల్లించారు. ఎక్కువ శాతం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు తమకు ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ ఇంకా విడుదల చేయలేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తాము పరీక్షలు నిర్వహించబోమని ఇప్పటికే యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల నుంచి అన్ని కళాశాలలు కూడా పరీక్షల ఫీజులు ఇప్పటికే వసూలు చేశారు. అయితే ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగా పరీక్షలు నిర్వహించబోమని భీష్మించుకుని విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు పరీక్షల విభాగానికి చెల్లించడం లేదు. ఇప్పటివరకు నామినల్ రూల్స్ కూడా పంపలేదు. ఈ క్రమంలో మంగళవారం యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, పరీక్షల విభాగం అధికారులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం సమావేశం నిర్వహించారు. ఇందులో ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు డిగ్రీ వివిధ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 21నుంచి యథావిధిగా ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ ప్రకటించారు. ఈ రెండు మూడురోజుల్లో మిగతా కాలేజీల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే ఆ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. లేనిపక్షంలో పరీక్షలు నిర్వహించబోమని రాజేందర్ తెలిపారు. కాగా, ఫీజులు చెల్లించి పరీక్షల నిర్వహణకు మిగతా కాలేజీల యాజమాన్యాలు ముందుకువస్తాయా లేదా వేచి చూడాల్సిందే.

'మత్తు' తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- 10 కిలోల గంజాయి, 2 కిలోల హాశీష్ ఆయిల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ షేక్ సలీమా


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ షేక్ సలీమా

వరంగల్ క్రైం : గంజాయి, హాశీష్ ఆయిల్ తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన 10 కిలోల గంజాయి, సుమారు రూ.25 లక్షల విలువైన 2 కిలోల హాశీష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. డీసీపీ కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన సుధాకర్, కోటగిరి సాయివినయ్ అలియాస్ వినయ్ 2023లో తన స్నేహితుడు వరుణ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి వెళ్లి గంజాయి తీసుకొస్తుండగా డొంకరాయి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఇక్కడ (జైలు) ములుగుకు చెందిన లావుడ్యా రవీందర్‌కు తాను గంజాయి అమ్ముకుంటానని చెప్పాడని పేర్కొంటూ ఇటీవల సుధాకర్‌పై దాడిచేయగా సాయి వినయ్‌పై హనుమకొండ పీఎస్‌లో కేసు నమోదైంది. అనంతరం సాయి వినయ్‌ను ఖమ్మం సెంట్రల్ జైలుకు తరలించగా అక్కడ హరి, కబీర్ సింగ్ ఇద్దరు పరిచయమై సాయి వినయ్ ఫోన్ నంబర్ తీసుకున్నారు. మూడు వారాల క్రితం హరి.. సాయివినయ్‌కి ఫోన్ చేసి తన దగ్గర హాశీష్ ఆయిల్ ఉందని చెప్పాడు. దీనిని సిగరెట్లకు పూసి తాగితే కిక్కు వస్తుందని, ఇది కిలో రూ. 12.50 లక్షల వరకు ఉంటుందని చెప్పి తన అన్న రామ్మూర్తి ద్వారా ఆ ఆయిల్‌ను వరంగల్ రైల్వే స్టేషన్‌లో అందజేయగా సాయివినయ్ ఇంట్లో దాచాడు. పది రోజుల క్రితం ములుగు జిల్లా జగ్గన్నపేట అన్నంపల్లి తండాకు చెందిన ఆటో డ్రైవర్ లావుడ్యా రవీందర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమర్ సింగ్ తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్.. 12 కిలోల ఎండు గంజాయి తీసుకుని సాయి వినయ్‌కు ఇవ్వగా దానిని కూడా తన ఇంట్లో దాచాడు. అనంతరం సాయి వినయ్.. రవీందర్‌కు ఫోన్ చేసి తన దగ్గర హాశీష్ ఆయిల్ ఉందని తెలుపగా రవీందర్, హరిసింగ్ మంగళవారం ఆటోలో సాయివినయ్ ఇంటికి వచ్చారు. అనంతరం ఇద్దరు ఆటోలో, ఒకరు బైక్‌పై వెళ్తుండగా రెడ్డి కాలనీ ప్రాంతంలో పోలీసులకు అనుమానం వచ్చింది. తనిఖీ చేయగా గంజాయి, హాశీష్ ఆయిల్ లభించడంతో ముగ్గురిని అరెస్ట్ రిమాండ్‌కు తరలించామని, మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు డీసీపీ షేక్ సలీమా తెలిపారు.

ఉపాధి హామీ పనులకు తాజా మాజీ సర్పంచ్


పని చేస్తున్న రామ్మూర్తి

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి తాజామాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి మంగళవారం లాలుతండాజీపీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా అప్పులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి అనేక పనులు చేశానన్నారు. కానీ ఇప్పటి వరకు తనకు బిల్లులు రాలేదన్నారు. మొత్తం రూ.15లక్షల బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఉపాధి హామీ పనులకు వెళ్తున్నానని తెలిపారు.

భాషాపండితులకు సన్మానం


సన్మానం పొందిన భాషాపండితులు

విద్యారణ్యపురి: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది ఉద్యోగ విరమణ పొందబోతున్న పలువురు భాషాపండితులను టెన్త్ స్పాట్‌లో సన్మానించారు. మూల్యాంకనం చేపడుతున్న ఫాతిమా హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ వాసంతి మాట్లాడుతూ టెన్త్ మూల్యాంకనంలో భాగస్వాములైన భాషాపండితుల సేవలను కొనియాడారు. రాష్ట్రీయ భాషా పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ భాషా పండితులు అప్‌గ్రేడ్ కోసం కృషి చేయగా పదోన్నతులు లభించాయని గుర్తుచేశారు. ఆ పరిషత్ బాధ్యులు అంకేశ్వరపు కుమారస్వామి, బి. వెంకన్న, అల్లం నర్సయ్య, సదానందం, భిక్షపతి, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.